
సాక్షి ఒడిశా

సోమవారం ׀ 29 ׀ మే ׀ 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,66,791, బంగారం 850 మిల్లీ గ్రాములు, వెండి 5 గ్రాముల 850 మిల్లీ గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



తెలుగు ప్రజలకు రుణపడి ఉంటాను - 8లో



భారీగా గంజాయి పట్టివేత - 8లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌కు స్కాచ్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ లింగరాజ పండా

పర్లాకిమిడి: గజపతి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ మాధ్యమిక పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేయడం ద్వారా డ్రాపౌట్లు నివారించడం, విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంలో ప్రధాన పాత్ర వహించిన కలెక్టర్ లింగరాజ్ పండాను కేంద్ర ప్రభుత్వం గుర్తించి ఉత్తమ స్కాచ్ అవార్డును ప్రకటించింది. ఈ అవార్డును న్యూఢిల్లీలోని అంతర్జాతీయ కేంద్రంలో శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో గణశిక్షా అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు భవిష్యత్తులో నిర్వహిస్తామన్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సామాజిక సంక్షేమ శాఖ అధికారి సంతోష్ కుమార్ రోథో తదితరులు పాల్గొన్నారు.

ఒడియా కార్మికుడికి సత్కారం



సత్కారం పొందుతున్న కార్మికులు

భువనేశ్వర్: న్యూఢిల్లీలోని కొత్త పార్లమెంట్ భవన నిర్మాణంలో విశేష పాత్ర పోషించిన కార్మికులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ప్రత్యేకంగా సత్కరించారు. అయితే ప్రధానమంత్రి సత్కారం పొందిన వారిలో ఒడిశాకు చెందిన పురంజన్ దొలై ఒకరు కావడం విశేషం. ఈయన బాలాసోర్ జిల్లా చాందీపూర్ ప్రాంతీయుడు. చారిత్రాత్మక కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించే ముందు పురంజన్‌తో పాటు ఇతరులను మోదీ సంప్రదాయ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.

మూడు నాటు తుపాకీలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న తుపాకీలు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా సమితి పరిధి అడవ పోలీసుస్టేషన్ పరిధిలోని బుదానెల్లి గ్రామంలో నాటు తుపాకులు అమ్ముతున్న సమాచారం మేరకు, పోలీసులు శనివారం రైడ్ చేశారు. దీనిలో భాగంగా మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు అడవ ఐఐసీ ఎస్.కె.పండా తెలియజేశారు. అయితే పోలీసుల దాడి విషయం తెలియడంతో తుపాకులు అమ్ముతున్న వ్యక్తి తప్పించుకొని పారిపోయాడు. అడవ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగులకు ఐడీ కార్డులు



ఐడీ కార్డులు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ పరిధిలోని 9 మంది దివ్యాంగులు, మానసిక వికలాంగుల ఇళ్లకు జిల్లా న్యాయ సలహా ప్రాధికరణ కార్యదర్శి రబినారాయణ బెహరా ఆదివారం వెళ్లి యూనిక్ డిజేబిలిటీ ఐ.డీ. (యు.డి.ఐ.డీ) కార్డులను అందజేశారు. దివ్యాంగుల వారాంతపు ప్రచారంలో భాగంగా జిల్లా సామాజిక సురక్షా సంక్షేమ శాఖ, పర్లాకిమిడి పురపాలక సంఘం, సమర్థ్ దివ్యాంగుల సంస్థ అధికారి సంతోష్ నాయక్‌ల సహకారంతో జిల్లా న్యాయ సలహా ప్రాధికరణ అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, సమర్థ్ సంస్థ అధ్యక్షుడు సంతోష్ మహారాణా, పురపాలక వైస్ చైర్మన్ లెంకమధు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ అనుగ్రహం.. అపార నమ్మకం



గొడొపాదర్ గ్రామంలో వెలసిన బిరిపాణి దేవి

- ఘనంగా బిరపాణి జాతర
- జాతరతో వర్షపాతం అంచనా
- అంచనా తప్పదని ఆదివాసీల విశ్వాసం

జయపురం: ఆదివాసీ ప్రజల ప్రధాన జీవనాధారం వ్యవసాయం. అందుకు అవసరమైన సాగునీటి కోసం వారు వర్షంపైనే ఆధారపడతారు. అయితే వర్షాకాలంలో వర్షపాతం ఎంత ఉంటుంది. ఆ వర్షపాతానికి అనువుగా ఎటువంటి పంటలు సాగు చేయాలని అనేది మాత్రం బిరిపాణి జాతర ద్వారా తెలుసుకోవడం గొడొపాదర్ గ్రామస్తుల ప్రత్యేకత.

ప్రగాఢ విశ్వాసం

నేడు విజ్ఞానం రంగం అభివృద్ధి చెంది వాతావరణ పరిశోధకులు వర్షంపాతం ఎలా ఉంటుంది అంచనా వేసి, వర్షపాతానికి ఏ పంటలు సక్రమంగా పండుతాయో సూచనలు ఇస్తుంటారు. అయితే ఒక్కోసారి వాతావరణ పరిశోధకుల అంచనాలు తప్పవచ్చు కానీ, బిరిపాణి జాతరలో గ్రామ దిశారీలు, పూజారుల అంచనాలు తప్పవని కొరాపుట్ ఆదివాసీ ప్రజల ప్రగాఢ విశ్వాసం. అందుకే వారు ప్రతి ఏడాది వర్షాకాలానికి ముందుగా భక్తిశ్రద్ధలతో జాతరను నిర్వహిస్తారు. జయపురం సమితి గొడపాదర్ గ్రామంలో జాతరను చూసి, వర్షపాతం అంచనాలు వినేందుకు అనేక గ్రామాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివస్తారు. ఈ జాతరను ఆ గ్రామ దిశారి జ్యోతిష్ గణాంకాలు లెక్కలు కట్టి, జ్యేష్ఠ మాసంలో ఏదో ఒక శనివారం నిర్ణయిస్తారు. ఈ ఏడాది ఈనెల 27వ తేదీన జాతర నిర్వహించారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి మొక్కులు చెల్లించారు. దేవీ మూలపీఠం గ్రామానికి సమీపంలోని 1,200 అడుగుల ఎత్తున గల బండమాలి పర్వతం వద్దకు దేవీ లాఠీలతో భక్తులు వెళ్లారు. దారి పొడవునా భక్తులు లాఠీలకు పూజలు చేయటం కనిపించింది. మార్గంలో చిన్న పిల్లలను తల్లిదండ్రులు పడుకొనిబెట్టగా, వారిపై నుంచి లాఠీదారులు నడిచారు. అలా చేయడం వలన పిల్లలకు వ్యాధులు రావని వారి నమ్మకం. లాఠీదారులు, దిశారీలు పర్వతం ఎక్కి అక్కడ పూజలు చేశారు. అనంతరం ఆ పర్వతానికి ఉన్న మూడు బిలాల్లోకి పావురాలను విడిచిపెట్టారు. పావురాలు బిలంలోనికి వెళ్లిన క్షణం బిలం నుంచి నీరు బయటకు వచ్చింది. దిశారి బిలంలో చేయి పెట్టి బిలంలోని నీటి మట్టాన్ని అంచనా వేశాడు. ఈ ఏడాది వర్షాలు బాగా పడి పంటలు బాగా పండుతాయని వెల్లడించాడు. దానితో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. బిలం నుంచి వచ్చిన నీటిని దిశారీ సేకరించి దేవికి పూజ చేసిన తర్వాత ప్రజలకు అందజేసారు. ఆ నీరు తాగితే వ్యాధులు నయమవుతాయని ప్రజల విశ్వాసమని దిశారి తెలిపారు. ఆ నీటిని పొలాల్లో చల్లితే పంటలను సమృద్ధిగా పండుతాయన్నారు.



బరువైన లాఠీలతో పిల్లల పైనుంచి నడుస్తున్న లాఠీదారి



దేవీ లాఠీలకు పూజలు చేస్తున్న భక్తులు



బండమాలి పర్వతంపై పూజలు చేస్తున్న పూజారులు



జాతరలో పాల్గొన్న ప్రజలు

సింహ ద్వారానికి వెండి తాపడం

- పూరీ జగన్నాథ ఆలయం సీఏవో రంజన కుమార్ దాస్

భువనేశ్వర్: ప్రసిద్ధ పూరి జగన్నాథ స్వామి దేవస్థానం సింహ ద్వారం వెండి తాపడం పనులకు రంగం సిద్ధమైందని పూరీ జగన్నాథ ఆలయం సీఏవో రంజన కుమార్ దాస్ తెలియజేశారు. ఈ ఏడాది స్వామివారి వార్షిక రథయాత్ర ముగిసేలోగా పనులను పూర్తి చేస్తారన్నారు. ఉన్నత స్థాయి సాంకేతిక నిపుణుల కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు ఆయన వివరించారు. ఈ పనుల్లో భాగంగా దేవాలయంలోని దేవతల రత్న మంచం మరమ్మతుల పనులను పూర్తి చేస్తారు. శ్రీమందిరం సింహద్వారం వెండి తాపడం కోసం ఆలయ నిర్వాహకులు భారత పురావస్తు సర్వే సంస్థ (ఏఎస్ఐ)తో సంప్రదింపులు జరిపారు. ఈ వర్గం సహాయ సహకారాలతో ఈ పనులు లోప రహితంగా చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సింహ ద్వారం వెండి తాపడానికి అవసరమైన సమగ్ర వెండి విరాళంగా అందజేసేందుకు ఒక దాత స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు సీఏవో పేర్కొన్నారు. సింహ ద్వారం పనులు జరిగే సమయంలో భక్తుల రాకపోకలు నివారించి, ఉత్తర ద్వారం గుండా దర్శనం కోసం ఆలయంలోకి అనుమతిస్తారు.



శ్రీమందిరం సింహద్వారం

తాత్కాలిక తలుపులు ఏర్పాటు

వెండి తాపడం పనులు పురస్కరించుకొని సింహ ద్వారం ప్రాంగణంలో తాత్కాలిక తలుపులు ఏర్పాటు చేస్తారని సాంకేతిక నిపుణుల కమిటీ సభ్యుడు ఎస్.సి.పాల్ తెలిపారు. వెండి తాపడం పనులు పూర్తయ్యాక సింహద్వారం యథాతథంగా అమర్చడం జరుగుతుందన్నారు. వెండి తాపడం వ్యయ ప్రణాళిక రూ.3 కోట్ల 50 లక్షలుగా పేర్కొన్నారు. 2015 సంవత్సరంలో శ్రీమందిరం సింహ ద్వారానికి ఇత్తడి తాపడం చేశారు. జగన్నాథుని మారు రథయాత్ర (బహుడా) ముగిసేలోగా ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సింహ ద్వారం వెండి తాపడం పనులు ఆద్యంతాలు సీసీటీవీ పర్యవేక్షణలో కొనసాగుతాయి. ఈ వ్యవధిలో పనులు జరిగే ప్రాంగణంలో ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటవుతుందన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

పర్లాకిమిడి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగు చలన చిత్ర నటసార్వభౌమ నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భంగా పర్లాకిమిడి చైతన్య ఆంధ్ర సాహితీ సంస్కృతి సమితి సభ్యులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక శ్రీకృష్ణ చంద్ర డైమాండ్ జూబ్లీ కుష్ఠ రోగుల పునరావాస కేంద్రంలో రోగులకు పండ్లు, స్వీట్లు అందించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి బి.జనార్ధనరావు, కోశాధికారి పొట్నూరు హరి, అధ్యక్షుడు కె.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొరాపుట్ కాంగ్రెస్‌లో కుమ్ములాట



పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయిక్‌తో కొరాపుట్ జిల్లా కాంగ్రెస్ నేతలు

- పీసీసీ అధ్యక్షుని వద్దకు వివాదం

జయపురం: కొరాపుట్ జిల్లా కాంగ్రెస్‌లో జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి, కొరాపుట్ ఎంపీ సప్తగిరి శంకర ఉల్కల మధ్య రగులుతున్న అంతర్గత వివాదం ఆదివారం తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మీనాక్షీ బాహిణీపతిని తొలగించాలని కొంతమంది డిమాండ్ చేస్తుండగా, ఆమెకు మద్దతు పలుకుతూ అనేక మంది జిల్లా కాంగ్రెస్ నేతలు, 12 మంది కాంగ్రెస్ జిల్లా పరిషత్ సభ్యులు, 13 బ్లాకల కాంగ్రెస్ అధ్యక్షులు, జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్ర కుమార్ మహంతి, కోట్‌పాడ్ మున్సిపల్ చైర్మన్ ఎం.శంకరరావు, సునాబెడ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు, కొరాపుట్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తదితరులు పీసీసీ అధ్యక్షులు శరత్ పట్నాయిక్‌ను ఆదివారం కలిసి చర్చించారు. డీసీసీ అధ్యక్షురాలిగా మీనాక్షీ బాహిణీపతిని ఎట్టిపరిస్థితిలోనూ మార్చవద్దని విజ్ఞప్తి చేశారు. ఒకవేళ ఆమెను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే తామంతా పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. కొరాపుట్ ఎంపీ ఉల్క జిల్లా అధ్యక్షురాలు పదవి నుంచి మీనాక్షీని తొలగించాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయన ప్రయత్నాలను అడ్డుకునేందుకే జిల్లా కాంగ్రెస్ నేతలు పీసీసీ అధ్యక్షుడిని కలిసినట్లు తెలుస్తోంది.

సమభావంతో సిబ్బందిని పరిరక్షించాలి

భువనేశ్వర్: సిబ్బందికి సమభావంతో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు అమలు చేయాలని తూర్పు కోస్తా రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు ఉద్యోగుల బదిలీ, పదోన్నతి సౌకర్యాల్లో వ్యత్యాసాలు నివారణకు తమ వర్గం కృషి చేస్తోందని శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు తెలిపారు. ఇటీవల అరకులో ముగిసిన కార్యవర్గ సమావేశం తీర్మానం మేరకు తూర్పు కోస్తా రైల్వే జోన్ వ్యాప్తంగా కార్యకర్తలు కృషి చేస్తారని తెలిపారు. పదోన్నతి, ఖాళీల భర్తీ విషయాల్లో యాజమాన్యపరమైన జాప్యం నివారించి, సకాలంలో సిబ్బందికి లబ్ధి చేకూర్చాలన్నారు. అలాగే పాత పింఛన్ వ్యవస్థ పునరుద్ధరణకు నిరవధికంగా పోరాటం కొనసాగుతుందని తెలియజేశారు. విధి నిర్వహణలో మహిళలకు బిడ్డల సంరక్షణ నేపథ్యంలో సెలవులు మంజూరు చేయడంలో సానుకూల వైఖరితో ముందుకు రావాలని అభ్యర్థించారు. రైల్వే సహకార సంస్థ (అర్బన్ బ్యాంకు)లో పేరుకుపోయిన విశ్రాంత సిబ్బంది లాభం వాటా విడుదలపై చర్యలు చేపట్టేందుకు ఒత్తిడి తెస్తామని వివరించారు.



కార్యకర్తలతో శ్రామిక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్ చంద్ర సాహు

ఆరుగురు దొంగలు అరెస్టు



అరెస్టు చేసిన దొంగలను చూపిస్తున్న పోలీసులు




స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు



సీజ్ చేసిన ఆటో

బరంపురం: గంజాం జిల్లా పట్టపూర్ బ్లాక్ దయాపల్లి గ్రామంలో జరిగిన దోపిడీ ఘటనలో ఆరుగురు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఐఐసీ అధికారి సభ్యసాచి మాల్లిక్ తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి గంజాం జిల్లా పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి దయాపల్లి గ్రామంలోని రబింద్ర డొరా ఇంటిలో దొంగలు చొరబడి, బంగారం, వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. దీనిపై బాధితుడు ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఆదివారం ఆరుగురు దొంగలను అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి 180 గ్రాముల బంగారు ఆభరణాలు, 103 గ్రాముల వెండి ఆభరణాలు, 1 మొబైలుతో పాటు దోపిడీకి వినియోగించిన ఆటోని సీజ్ చేశారు. అరెస్టైనవారిలో జిల్లాకి చెందిన హరి దకువా, కురేష్ దకువా, డి.టున్నా, ఎస్.ససిబా దాస్, విక్రమ్, రమేష్ పాత్రోలు ఉన్నట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

ఇంటి ఆవరణలోకి దూసుకొచ్చిన లారీ



గోడపైకి దూసుకెళ్లిన లారీ


మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి పోలీసుస్టేషన్ ఎదురుగా నివాసముంటున్న సహదేవ్ నాయిక్ ఇంటి అవరణలోకి ఆదివారం ఉదయం ఒక లారీ దూసుకొచ్చింది. మల్కన్‌గిరి నుంచి జయపురం వెళ్తున్న లారీకి బ్రేక్ పడకపోవడంతో ఇంటి గోడను బలంగా ఢీకొంది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. వెంటనే పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీ యజమాని వచ్చి ఇంటికి నష్టపరిహారం ఇవ్వాలని సహదేవ్ కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

ఇద్దరు నేతలకు షోకాజ్ నోటీసులు

- గడువులోగా వివరణ ఇవ్వాలి: ఏఐసీసీ



మహ్మద్ మొకీమ్



చిరంజీబ్ బిస్వాల్

భువనేశ్వర్: పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో అఖిల భారత కాంగ్రెస్ (ఏఐసీసీ) క్రమశిక్షణా కమిటీ రాష్ట్రానికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులకు షోకాజు నోటీసులు జారీ చేసింది. వీరిలో బరాబటి-కటక్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్, సీనియర్ నాయకుడు చిరంజీబ్ బిస్వాల్ ఉన్నారు. వీరిద్దరూ నిర్ణీత గడువులోగా అధిష్టానానికి సంతృప్తికరమైన వివరణ దాఖలు చేయాల్సి ఉందన్నారు. ఈనెల 8వ తేదీన స్థానిక జయదేవ్ భవ‌న్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీకి వ్యతిరేకంగా చేసిన ప్రకటనలపై వివరణ కోరుతూ చిరంజీబ్ బిస్వాల్‌కు అప్పుడే షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో క్రమశిక్షణ చర్యలు చేపట్టే ముందు వివరణ కోరారు.

ఇదీ జరిగింది

ఝార్సుగుడ ఉప ఎన్నికలకు ముందు జయదేవ్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో చిరంజీబ్ బిస్వాల్ మాట్లాడుతూ ఉప ఎన్నికలకు పార్టీ అభ్యర్థి ఎంపిక తప్పు అని వేలెత్తి చూపారు. అలాగే ఉప ఎన్నికల ప్రచార కమిటీని సైతం ఆయన నిలదీశారు. రాష్ట్ర శాసనస సభలో పార్టీ బలం తొమ్మిది మంది ఎమ్మెల్యేలు కాగా, 20 మంది నేతలు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారన్నారు. ఇది పార్టీలో ఐక్యతను దెబ్బతీసిందని ఎద్దేవా చేశారు. దీంతో అప్పుడే ఆయనకు షోకాజు నోటీసు జారీ అయింది. అలాగే భారత రాష్ట్రపతి ఎన్నికల సమయంలో ద్రౌపది ముర్ముకు అనుకూలంగా ఓటువేసి మొకీమ్ వివాదంలో చిక్కుకున్నారు. దీంతో ఆయనకు ఆదివారం నోటీసులు జారీ చేశారు.

క్లుప్తంగా

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధత

- సిబ్బంది బదిలీలకు సన్నాహాలు

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాష్ట్రంలో సంబంధిత అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. ముందస్తు ఎన్నికల కసరత్తులో భాగంగా రెవెన్యూ – విపత్తు నిర్వహణ శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లను తమ పరిధిలో పనిచేస్తున్న అధికారుల జాబితాను సమర్పించాల్సిందిగా ఆదేశించింది. జిల్లా కలెక్టర్లు ఈనెల 29వ తేదీ లోగా జాబితాను సమర్పించాలని రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ అదనపు కార్యదర్శి లేఖ జారీ చేశారు. సొంత జిల్లా, ఒకేచోట 3 ఏళ్లు పైబడి నిరవధికంగా పనిచేస్తున్న వోఏఎస్-ఏ (జేబీ), ఓఆర్ఎస్ గ్రూపు-బీ అధికారుల పేర్లు తదితర వివరాలను నిర్ధారిత దరఖాస్తులో దాఖలు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. 2024లో లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలకు సాధారణ ఎన్నికలకు సంసిద్ధత కోసం అధికారుల బదిలీ మరియు పోస్టింగ్‌కు సంబంధించి ఒడిశా ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) అనుబంధ వివరాలను కోరినట్లు రాష్ట్ర రెవెన్యూ – విపత్తు నిర్వహణ శాఖ అదనపు కార్యదర్శి తెలిపారు.

అసిస్టెంట్ కలెక్టర్ ఇంట్లో చోరీ



బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు

రాయగడ: స్థానిక కస్తూరీ నగర్ మూడో లైన్‌లో నివసిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ ఇంట్లో ఆదివారం చోరీ జరిగింది. మల్కన్‌గిరి జిల్లాలో అసిస్టెంట్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రశన్న కుమార్ పాడి కుటుంబ సభ్యులు కస్తూరీ నగర్‌లో నివసిస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆయన మల్కన్‌గిరిలో ఉండగా అయన ఇంట్లోకి కిటికీలు విరగొట్టి దుండగులు ప్రవేశించి, బీరువాలో ఉన్న పది తులాల వెండి, రూ.5 వేల నగదు దోచుకున్నారు. ఆ సమయంలో అతని భార్య, చెల్లి ఇంట్లోనే పడుకున్నారు. ఇంట్లో ఏదో శబ్దం వస్తున్నట్లు గమనించి పాఢి భార్య లేచి చూసేసరికి గుర్తు తెలియని దుండగులు, బీరువాలో వస్తువులను చిందరవందర చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆమె కేకలు వేయగా దొరికిన సొమ్ముతో వారంతా పరుగులు తీశారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పార్వతీపురం: గడ్డిమందు తాగి యువకుడు వి.మోహనరావు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ దుర్ఘటన మక్కువ మండలంలోని డి.శిర్లాం గ్రామంలో జరిగింది. ఇదే గ్రామానికి చెందిన మోహనరావు డిగ్రీ పూర్తి చేసి, గత కొంత కాలంగా ఖాళీగా ఉంటున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అతడు తాను కుటుంబానికి భారం కాకూడదని భావించి, శనివారం రాత్రి ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలోని కొడుకును తల్లిదండ్రులు ఆదివారం చూసి, చికిత్స నిమిత్తం పార్వతీపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఇసుక నిల్వల సీజ్



ఇసుక పోగులను చూపిస్తున్న ఎస్‌ఐ గంగరాజు

గజపతినగరం: మండలంలోని ఎస్.లింగాలవలస గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ గంగరాజు ఆదివారం తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేశామని, ఇవి ఎవరు నిల్వ చేశారన్న దానిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.

శృంగవరపుకోట: మండలంలోని మామిడిపల్లి, గోపాలపల్లి గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాటుబళ్లను పట్టుకుని, స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

31న జాబ్‌మేళా



మాట్లాడుతున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

పార్వతీపురంటౌన్: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 31వ తేదీన మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రెడ్డీస్ ల్యాబరేటరీస్‌లో ఉద్యోగాలకు నిర్వహించే ఈ జాబ్‌మేళాకు ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ చదివి, 18 నుంచి 20 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువతీ, యువకులంతా అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు తొలుత డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్.హెచ్‌టీటీపీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని, రిఫరెన్స్ నంబర్‌తో పాటు బయోడేటా ఫారం, ఆధార్‌కార్డు, విద్యార్హత తెలిపే సర్టిఫికెట్లు(ఒరిజినల్), 1 పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో వెంట తీసుకురావాలన్నారు. ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తామని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9182398325, 7997299739ను సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి గ్రామ దేవత ఉత్సవాలు



సాంప్రదాయ ఉజ్జిడి బండికి పూజలు నిర్వహిస్తున్న పూజారి



సిద్ధమైన అమ్మవార్ల వెండి ఘటాలు

రాయగడ: స్థానిక గ్రామ దేవత ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవ్వనున్నాయి. అమ్మవారి పాదాలు తీసుకొచ్చే కార్యక్రమంతో ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. ఆదివారం తెల్లవారు జామున సాంప్రదాయ పద్ధతిలో అమ్మవారి ఉజ్జిడి బండి పట్టణంలో ఊరేగించారు. అంతకుముందు వెదురుతో తయారు చేసిన బండికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం ఆ బండిని పురవీధుల్లో తిప్పారు. ఈ బండి తిప్పే (ఊరేగించే) సమయంలో పుర ప్రజలు బండిలో చద్దన్నం వేస్తారు. గ్రామం చల్లగా ఉండాలనే లక్ష్యంతో ఈ పద్ధతులను పాటిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈసారి దాతలు ఇచ్చిన విరాళాలతో ఉత్సవ కమిటీ వెండితో తయారు చేసిన అమ్మవారి ప్రతిరూపాలుగా కొలిచే ఘటాలు సిద్ధమయ్యాయి. ఈసారి ఉత్సవాల్లో బురదల పోలమ్మ, మజ్జిగౌరమ్మల వెండి ఘటాలు మిగతా ఘటాలతో పట్టణంలో ఊరేగింపులో పాల్గొంటాయి.

తెలుగు ప్రజలకు రుణపడి ఉంటాను



షిర్డీ సాయికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సదాశివ ప్రధాని దంపతులు

కొరాపుట్: తెలుగు ప్రజలకు ఎల్లవేళలా రుణపడి ఉంటానని నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధానీ అన్నారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలో తెలుగు ప్రజలు ఎక్కువగా నివసించే చైనా మార్కెట్‌లోని షిర్డీ సాయి మందిర సమీపంలో ఆదివారం జరిగిన సాయి భక్తుల సమావేశంలో ప్రసంగించారు. తమ కుటుంబం దశాబ్దాలుగా తెలుగు ప్రజల సహకారంతో ముందుకు సాగుతోందన్నారు. తన పెద్దనాన్న ఖగుపతి ప్రధానీ నబరంగ్‌పూర్ ఎంపీగా వరుసగా 9 సార్లు గెలిపొందడంలో తెలుగు ప్రజల సహకారం ఉందని పేర్కొన్నారు. తన తండ్రి గోపీనాథ్ ప్రధాని నబంగ్‌పూర్ జిల్లా తొలి జిల్లా పరిషత్ అధ్యక్షునిగా పనిచేశారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఉన్నత ఉద్యోగం వదలి రాజకీయాల్లో రావడానికి కారణం ప్రజాసేవ చేయాలనే ఆకాంక్ష అన్నారు. ఇటీవల 5టీ కార్యదర్శి పాండ్యన్ జిల్లాకు వచ్చినపుడు తెలుగు ప్రజల ఆరాధ్య దైవమైన బాలాజీ కల్యాణ మండపం కోసం విజ్ఞప్తి వచ్చిందన్నారు. వెంటనే రూ.10 లక్షలు మంజూరు చేశామని తెలియజేశారు. అయ్యప్ప భక్తుల వసతి భవనం కోసం రూ.5 లక్షలు అందజేశామని వెల్లడించారు. ప్రస్తుతం షిర్డీసాయి మందిరం అభివృద్ధి కోసం తన కోటా నిధుల నుంచి తక్షణమే రూ.3 లక్షలు అందజేస్తానని ప్రకటించారు. అనంతరం విశ్వ బ్రాహ్మణ సంఘం విజ్ఞప్తి మేరకు సమీపంలో ఉన్న బ్రహ్మంగారి మఠం సందర్శించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురి మృతి

- రైలు ఢీకొని ఒకరు, ఉరి వేసుకుని మరొకరు, డివైడర్ ఢీకొని ఇంకొకరు, పురుగుమందు తాగి ఇద్దరు..
- కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్న పోలీసులు



రైలుపట్టాలపై ఉన్న మృతదేహం పరిశీలిస్తున్న జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు

చీపురుపల్లి: రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం జరిగింది. మృతుడు ఎవరన్నది తెలియరాలేదని, మృతుడు నీలంరంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని, 40 ఏళ్ల వయసు ఉంటుందని జీఆర్‌పీ ఎస్‌ఐ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం చీపురుపల్లి ప్రభుత్వాస్పత్రికి మృతదేహం తరలించారు. మృతదేహం కోసం ఫోన్ నంబర్ 7013273731ను కుటుంబ సభ్యులు సంప్రదించవచ్చన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంట్యాడ: పురుగుమందు తాగి, మహంతి ముసలనాయుడు అనే వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పెదమజ్జిపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పంట కోసం తీసుకువచ్చిన పురుగు మందు తాగి, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఉదయం 11 గంటల సమయంలో అతడి పరిస్థితిని చూసిన కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం విజయనగరంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 10:30 గంటలకు మృతి చెందాడు. గత కొంతకాలంగా ఆస్తమా వ్యాధితో బాధపడుతున్న ఆయన వ్యాధి తగ్గడం లేదన్న బాధతోనే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అంతా భావిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.



శ్రీహరి మృతదేహం

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన అప్పలనాయుడు

బొండపల్లి: పురుగు మందు తాగి, భీమవరపు అప్పలనాయుడు(40)అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వేకువజామున పురుగుమందు తాగిన ఆయన అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతడిని చూసి అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వైద్యసేవల నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య రెండేళ్ల క్రితమే మరణించగా, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.



వేణుగోపాలనాయుడు మృతదేహం, (ఇన్‌సెట్లో) వేణుగోపాలనాయుడు(ఫైల్)

యువకుడి ఆత్మహత్య

శృంగవరపుకోట: మండలంలోని కొట్టాం గ్రామానికి చెందిన యువకుడు నున్నగొప్పుల శ్రీహరి(27) ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయినట్లు ఆయన తండ్రి సీతంనాయుడు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. యువకుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియరావాల్సి ఉందని ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగానే యువకుడు చనిపోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగి మృతి..

విజయనగరం క్రైమ్: మండలంలోని తోటపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్టీసీ ఉద్యోగి అల్లు వేణుగోపాలనాయుడు(59) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. స్థానిక ఆర్టీసీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈయన ఆదివారం తోటపాలెం సమీపంలోని ఇంటి వద్ద కాలువ పనులు చేయించి, మధ్యాహ్నం తిరిగి తన బైక్‌పై కంటోన్మెంట్‌కు వెళ్తుండగా బ్రిడ్జి దగ్గరున్న డివైడర్‌ను ఢీకొన్నారు. దీంతో అతడి తలకు తీవ్రగాయమై, అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. మృతునికి భార్య పద్మావతి, కుమారులు భార్గవ్, వైభవ్ ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌ఐ రామగణేష్ తెలిపారు.

డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌కు సత్కారం



సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న విజయనగరం జిల్లా ప్రాసిక్యూటర్లు

విజయనగరం లీగల్: డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కడప జిల్లాకు చెందిన సీనియర్ న్యాయవాది జల్ల సుదర్శన్ రెడ్డిని విజయనగరం జిల్లాకు చెందిన ప్రాసిక్యూటర్లంతా సత్కరించారు. ఆదివారం విశాఖపట్నంలో జరిగిన జోన్-1 సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయనను వీరంతా కలిసి, దుశ్శాలువా, మెమెంటోలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. అనంతరం పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మెట్ట ఖజానారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేలూరి రఘురాం, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు బెల్లాన రవి, మరువాడ రవీంద్రనాథ్, ఖండపు, ఫల్గుణరావు, మావూరి శంకరరావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

విజయనగరం క్రైమ్: స్థానిక ధర్మపురి సమీపంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులు(జూదరులు)ను పోలీసులు ఆదివారం పట్టుకుని, అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి రూ.7,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు తెలిపారు. ఇదిలా ఉండగా, చెల్లూరు గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.3,200 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ఐరన్ దొంగలు దొరికారు..



పట్టుబడిన దొంగలతో ఎస్‌ఐ సన్యాసినాయుడు, సిబ్బంది

చీపురుపల్లి: గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి చెందిన ఐరన్ పైపులను దొంగిలించిన నలుగురు దొంగలను 24 గంటలు గడవకముందే ఎస్‌ఐ సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకుని, అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగానికి చెందిన 300 కేజీల బరువైన 12 పైపులను ఈ నెల 26వ తేదీన రాత్రి దొంగిలించారు. దీనిపై ఈ నెల 27వ తేదీన ఉదయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. అప్రమత్తమైన ఎస్‌ఐ సన్యాసినాయుడు సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేశారు. చోరీకి పాల్పడిన పట్టణానికి చెందిన బంగారు కనకరాజు, పేరూరి కనకరాజు, లకవలస త్రిమూర్తులు, గంగు మురళిను అదేరోజు సాయంత్రం పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి పైపులను స్వాధీనం చేసుకున్నారు. పైపుల రవాణాకు వినియోగించిన ఆటోను కూడా సీజ్ చేసి, వారిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భారీగా గంజాయి పట్టివేత



బరంపురం: స్వాధీనం చేసుకున్న గంజాయితో సురడా పోలీసులు



మల్కన్‌గిరి: పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి బోడపోదర్ పంచాయతీ సంగమ్‌గూడ గ్రామ సమీపంలోని అడవిలో రవాణాకు గంజాయి సిద్ధంగా ఉందని పోలీసులకు సమాచారం అందడంతో, ఆదివారం ఉదయం ఒక్కసారిగా దాడి నిర్వహించారు. దాడుల్లో 85 బస్తాల్లో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను పసిగట్టిన గంజాయి మాఫియా వ్యక్తులు పరారయ్యారు. మొత్తం గంజాయి బరువు 2,152 కేజీలుగా స్పష్టం చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందని చిత్రకొండ ఐఐసీ ముకుంద మాల్కు తెలిపారు.

బరంపురం: నగరానికి అక్రమంగా రవాణా చేస్తున్న 55 కిలోల గంజాయిని సురడా పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ఐఐసీ అధికారి తెలిపిన వివరాల మేరకు.. కొందమాల్ జిల్లా దరింగబడి నుంచి బరంపురం నగరానికి బొలేరోలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మార్గమధ్యలో వాహన తనిఖీలు చేపట్టారు. అనుమానంతో ఒక బొలేరోలో సోదాలు చేయగా 25 కిలోల గంజాయి బస్తా బయటపడింది. దీంతో వాహనంతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా ఛత్రపూర్ పట్టణంలోని బమ్మునపల్లి గ్రామంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న సమయంలో ఛత్రపూర్ పట్టణ పోలీసులు దాడులు నిర్వహించి మరో 30 కిలోల గంజాయి బస్తాలు సీజ్ చేశారు.

రాయగడలో అవధాన ప్రక్రియ



అవధాని సాయికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రాయగడ: స్థానిక బాలాజీ నగర్‌లో ఉన్న వేంకటేశ్వర కల్యాణ మండపంలో అష్టావధాన ప్రక్రియ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా మల్లికార్జునపురం నుంచి వచ్చిన యువ అవధాని రంపా సాయికుమార్ శర్మ ఆధ్వర్యంలో అద్భుతంగా అవధానం జరిగింది. ఉత్కళాంధ్రుల బ్రాహ్మణ సమాజం, స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమానికి బంకుపల్లి రమేష్ కుమార్ అవధాన సంచాలకుడుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పృచ్ఛకులు ఏవీ భాస్కర గుప్త, భళ్లమూడి నాగేశ్వరరావు, తులసీదాస్, బ్రాహ్మణ సమాజం అధ్యక్షుడు రేజేటి శ్రీనివాస్ శర్మ, పి.గణపతి శాస్త్రి, పి.కృష్ణమూర్తి, పి.భాస్కరాచార్యులు, బుర్రా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రక్తమోడిన రహదారి

ఒకే కుటుంబానికి చెందిన నలుగురు బైక్‌పై బంధువుల ఇంటికి బయలుదేరారు. బంధువులను కలిసి తిరిగి స్వగ్రామానికి పయనమయ్యారు. కాసేపట్లో ఇంటికి చేరుతామనగా గంట్యాడ మండలం రామవరం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే ఇద్దరు మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందగా.. మూడేళ్ల బాలుడు సురక్షితంగా బయటపడ్డాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాల్లోకి వెళ్తే...



రామవరం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఢీకొన్న బైక్‌లు

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి
- మృతుల్లో తండ్రీకూతుళ్లు
- సురక్షితంగా బయటపడ్డ మూడేళ్ల బాలుడు
- మరొకరికి తీవ్ర గాయాలు

గంట్యాడ:

మండలంలోని వసాది గ్రామానికి చెందిన లోకవరపు సత్యంనాయుడు ఉరఫ్ సత్యారావు పైడిభీమవరంలోని అరబిందో కర్మాగారంలో పని చేస్తున్నాడు. కుటుంబంతో కలిసి విజయనగరంలోని కామాక్షి నగర్‌లో కొన్నాళ్లుగా నివాసం ఉంటున్నాడు. సత్యంనాయుడు అన్నయ్య అప్పారావు విశాఖలో ఉంటున్నాడు. అప్పారావు కుమార్తె గ్రీష్మ వేసవి సెలవుల కోసం సత్యంనాయుడు ఇంటికి కొద్ది రోజుల కిందట వచ్చింది. ఆదివారం సెలవు కావడంతో సత్యంనాయుడు వీటీ నగరంలో ఉంటున్న వరుసకు అన్నయ్య అయిన లోకవరపు అప్పారావు ఇంటికి తల్లి సత్యవమ్మ, బాలుడు విష్ణుతో పాటు విశాఖ నుంచి వచ్చిన గ్రీష్మతో కలిసి బైక్‌పై వెళ్లాడు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సత్యంనాయుడు





ప్రమాదంలో మృతి చెందిన గ్రీష్మ, నాగరాజు

అప్పారావు కుటుంబ సభ్యులను కలిసి సత్యంనాయుడు బైక్‌పై కామాక్షినగర్‌కు తిరుగు ప్రయాణమయ్యాడు. రామవరం గ్రామ సమీపంలో పప్పుల మిల్లు వద్దకు వచ్చేసరికి కొఠారుబిల్లి జంక్షన్‌కు చెందిన దుర్గాసి నాగరాజు విజయనగరం వైపు వస్తుండగా ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో సత్యంనాయుడుకు వరుసకు కుమార్తె అయిన గ్రీష్మ(10), నాగరాజు(45) ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. మిగతా ముగ్గురిని 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. సత్యంనాయుడు(33) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సత్యవమ్మ చికిత్స పొందుతుంది. మూడేళ్ల కుమారుడు విష్ణు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సత్యంనాయుడుతో పాటు అన్నయ్య కుమార్తె గ్రీష్మ ఒకే కుటుంబం వారు కావడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఎస్‌ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ హిమక్రీము రుచి తెలుసండీ..





లోకో భిన్న రుచి అన్నారు. అలాగే కొత్త ఒక వింత.. పాత ఒక రోత అన్నారు. కాలంతో పాటు ప్రజల జీవన శైలిలో ఎన్నో మార్పులు చోటు పదార్థాలను కాదని కొత్తదనాన్ని ఆహ్వానిస్తున్నారు.. ఆస్వాదిస్తున్నారు. మండు వేసవిలోనే కాదు.. ఏ కాలంలోనైనా చల్లచల్లగా.. నోట్లో వేసుకోగానే కరిగిపోతూ అద్వితీయమైన అనుభూతినిచ్చే ఐస్ క్రీమ్ కొత్తపుంతలు తొక్కుతోంది. మారుతున్న జనాల అభిరుచులను గుర్తించి, వారిని మరింత ఆకట్టుకునేందుకు తయారీదారులు సృజనను జోడించి కొత్త రుచులను అందుబాటులోకి తెస్తున్నారు.

– శ్రీకాకుళం డెస్క్

- క్యారెట్ నుంచి కాఫీ వరకు ఐస్‌క్రీమ్‌లో కాదేదీ కలిపేందుకు అనర్హం...
- నగరవాసుల నోరూరిస్తున్న 'సండీ'స్టైల్
- ఐస్‌క్రీమ్‌లకు విభిన్న రుచుల మేళవింపు



సైకిల్ మీద పుల్ల ఐస్.. బండి మీద ఐస్ ఫ్రూట్.. తర్వాత కప్పులూ కోన్‌లూ..ఇది హిమక్రీము రూపాంతరం. ఆ తర్వాత విభిన్న రుచుల మేళవింపుతో వెనిలా, చాక్లెట్, బట్టర్ స్కాచ్ వగైరా ఫ్లేవర్లన్నీ మార్కెట్లో హల్ చల్ చేశాయి. తర్వాత తర్వాత క్యారెట్ నుంచి కాఫీ దాకా కాదేదీ జతకట్టేందుకు అనర్హం అన్నట్టు ఎన్నో రుచులలో కరిగిపోతోంది హిమక్రీము. ఈ కలిసిపోయి కరిగేపోయే ఐస్‌క్రీమ్ నగరంలో హాట్ ఫేవరెట్. వివిధ కాంబినేషన్లతో ఐస్‌క్రీమ్‌ను తయారు చేయడాన్నే సండీ అంటారు. నగరంలోని వివిధ ఐస్‌క్రీమ్ పార్లర్లు, రెస్టారెంట్లలో సండీని సృష్టించి ఫుడ్ లవర్స్‌ను కూల్ చేస్తున్నారు తయారీ దారులు.

కలుపుకోమంటోంది..

విందుకు వెళ్తాం. భోజనం అంతా పూర్తయ్యాక ఐస్‌క్రీమ్ కోసం చూస్తాం. అదీ అందుతుంది. అయితే ఒంటరిగా కాదు ఏ గులాబ్‌జామ్‌నో, ఇంకేదో స్వీట్‌నో జత చేసుకుని మరీ. మొదట్లో కొత్తగా అనిపించేదేమో కాని ఇప్పుడు అతిథులే ఐస్‌క్రీమ్‌లో కలిపేందుకు స్వీట్ లేదేమిటా.. అని ఎదురు చూసేంతగా అలవాటైపోయింది. విందుల సంగతలా ఉంచితే... నగరవాసుల్లో ఈ మిక్స్‌డ్ టేస్ట్‌పై ఆసక్తి బాగా పెరగడంతో రెస్టారెంట్స్, పార్లర్స్ విభిన్న రకాల ప్రయోగాలతో మెనూను నింపేస్తున్నాయి. ''రెగ్యులర్ ఐస్‌క్రీమ్‌ను తినేవారి సంఖ్య బాగా తగ్గిపోయింది. కొత్త కొత్త వెరైటీలను జతచేసి చేస్తేనే కస్టమర్లు ఆస్వాదిస్తున్నారు'' అని నగరంలో రామ్‌లక్ష్మణ్ థియేటర్ రోడ్‌లోని ఓ ప్రముఖ ఐస్‌క్రీమ్ పార్లర్ నిర్వాహకులు తెలిపారు.

ఎన్నెన్నో...

ఏకకాలంలో ఒకటి లేదా రెండు లేదా ఇంకా ఎన్నయినా సరే కలిపేసుకునేందుకు నేను రెడీ అంటుంది ఐస్‌క్రీమ్. చాక్లెట్ పేస్ట్రీ లేదా బ్రౌనీ లేదా విభిన్న రకాల చాక్లెట్స్, జీడిపప్పు, బాదం, వాల్‌నట్స్, సేమియా తరహాలో ఉండే రెయిన్‌బో స్ప్రింకిల్స్, చాక్లెట్ స్ప్రింకిల్స్, చాక్లెట్ పంచ్, కారామిల్క్ పంచ్, యాపిల్, ఆరెంజ్.. ఇలా పలు రకాల పండ్లు.. ఐస్‌క్రీమ్‌లో ఇమిడిపోయేలా చేస్తున్నారు తయారీదార్లు.

కూల్ వెనిల్లా

గులాబ్‌జామ్, హల్వా, జిలేబీ వెనిల్లా ఐస్‌క్రీమ్ కలయిక నగరంలో సూపర్‌హిట్. విభిన్న రకాల వంటకాలని జత చేసేందుకు ఎక్కువగా వెనీల్లాని వాడతారు. ఎందుకంటే ఏ ఫ్లేవర్ అయినా దీనిలో సులభంగా కలిసిపోతుంది. దీనితో కనీసం 100 వెరైటీలు చేయవచ్చునని చెబుతున్నారు ఐస్‌క్రీమ్ పార్లర్ నిర్వాహకులు.

క్రేజీ ఐటెమ్..



ఐస్‌క్రీమ్‌ను దేనితోనైనా కలిపి వెరైటీ టేస్ట్‌ను సృష్టించవచ్చు. నగరంలో ఇప్పుడు విభిన్న రకాల సండీకే క్రేజ్. ఎప్పటికప్పుడు కొత్త కొత్త రకాల సండీని మేం అందిస్తున్నాం.

–గోవర్ధన్ సాయిప్రకాశ్ వాసిరెడ్డి, రెస్టారెంట్ యజమాని

సండీ అంటే... వివిధ కాంబినేషన్లతో ఐస్‌క్రీమ్‌ను తయారు చేయడాన్నే సండీగా వ్యవహరిస్తారు.

ఆ హిమక్రీము కారం.. కారం..



మీరు కరెక్ట్‌గానే చదివారు. ఐస్‌క్రీమ్ ఏమిటి.. కారంగా ఉండడమేమిటి అనుకుంటున్నారా..! మిర్చి ఘాటే కాదు.. పనస పనసలు.. ద్రాక్ష రుచులు.. ఔషధ గుణాల జామ.. ఇలా సీజన్‌తో సంబంధం లేకుండా మీరు ఏ పండు కావాలంటే ఆ పండు రుచిని అందిస్తోంది దీపామహల్ రోడ్‌లోని ఓ ఐస్‌క్రీమ్ పార్లర్. మండుటెండలో వీటి రుచిని హాయిగా.. స్థాయిగా ఆస్వాదిస్తుంటే ఆ అనుభూతి వేరు. వీటి ధరలు రకాన్ని బట్టి రూ. 70 నుంచి రూ.300 వరకు ఉన్నాయి.



నగరంలో లభించే కొన్ని సండీ



బ్రౌనీ హాట్ చాక్లెట్: వేడి చేసిన బ్రౌనీ కేక్ పెడతారు. కారామిల్క్ సాస్‌లో కలిపిన అరటిపండు ముక్కలు ఆ బ్రౌనీ పైన వేస్తారు. దాని మీద వెనిల్లా ఐస్‌క్రీమ్ పోస్తారు. దానిపైన మళ్లీ చాక్లెట్ పంచ్ కలుపుతారు. ఆపైన హాట్ చాక్లెట్ సిరప్ వేస్తారు. కస్టమర్ అభిరుచిని బట్టీ డ్రైఫ్రూట్స్, జెమ్స్, కలర్ స్ప్రింకిల్స్ వేస్తారు.
ధరలు: రూ. 200 నుంచి రూ.240 వరకు ఉంటుంది.



వార్మ్ వేపిల్స్: బెల్జియం వేపిల్ మీద ఐస్‌క్రీమ్, చాక్లెట్ సిరప్, చాక్లెట్ పంచ్, చిప్స్, నట్స్ వేసి చేస్తారు. రుచి అమోఘం.
రూ.265 నుంచి రూ.370 వరకు ఉంటుంది.



గులాబ్ జామ్ సండీ: వేడిగా ఉండే గులాబ్ జామ్ తీసుకుని దానిపైన వెనిలా ఐస్ క్రీమ్ పెట్టి నట్స్‌వేసి చేస్తారు. రుచి అదిరపోతుంది.
రూ.176

లేటెస్ట్' సండీ... ఇప్పుడు నగరంలో బాగా క్రేజీగా ఉన్న సండీ చిల్ స్టోన్. కోల్డ్ స్టోన్ మీద ఐస్‌క్రీమ్ టాపింగ్ వేసి ప్యాకింగ్ చేసాక అన్నీ కలిపి కైమాలాగ కొట్టేస్తారు. ఇప్పుడు సిక్కోలులో దీనికి బాగా క్రేజ్. 80 అడుగుల రోడ్డులోని ఓ రెస్టారెంట్‌లో రాత్రి వేళ రుచిని ఆస్వాదించేందుకు యువత, చిన్నపిల్లలూ క్యూ కడతారు. విభిన్న రుచుల్లో వీరు సర్వ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

ఎన్టీఆర్‌కు సైకత వందనాలు



ఎన్టీఆర్ సైకత శిల్పం

ఆమదాలవలస రూరల్: నటుడిగా, రాజకీయ నాయకుడిగా తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసిన నందమూరి తారక రామారావుకు సైకత శిల్పి గేదెల హరికృష్ణ సైకత వందనాలు సమర్పించారు. మండలంలో గాజులకొల్లివలస గ్రామం సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద ఆదివారం ఎన్టీఆర్ సైకత శిల్పాన్ని తీర్చిదిద్దారు.

ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు పోరాడతాం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు మాదిగలంతా ఏకమవ్వాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సన్నాహక సమావేశం సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో ఎస్సీ వర్గీకరణకు అవకాశమిచ్చి ఒక్క ఏడాది పాటు ఉంచి వెంటనే ఎత్తివేయడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారని అన్నారు. 20 ఏళ్లవుతున్నా నేటికీ ఎస్సీ వర్గీకరణకు కేంద్ర ప్రభుత్వం చొరవ చూపకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. మరో రెండు నెలల్లో హైదరాబాద్‌లో భారీ బహిరంగ నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాణా శ్రీనివాసమాదిగ, లోపింటి కృష్ణ, దేవరాపల్లి బక్షాలుమాదిగ, ముమ్ముడివరపు చినసుబ్బారావు, నత్తల కృష్ణ, అలజంగి చిన్నారావు, పుట్ట ఎల్లయ్య, దాసరి తిరుమలమాదిగ, లోపింటి తేజ, కానుకుర్తి గోవింద్‌మాదిగ, కంటిపాక హిమశేఖర్, బచ్చల పృథ్వీ, నవిరి ప్రసాద్, టి.అప్పారావు, టి.దిలీప్, లోపింటి నారాయణ, సంబాన రామారావు తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దులో నిఘా

కొత్తూరు: కొత్తూరు మండలంలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నాటుసారా, మద్యం అక్రమ రవాణా అరికట్టేందుకు నిఘా ఏర్పాటు చేసినట్లు స్థానిక సెబ్ స్టేషన్ ఎస్‌ఐ డి.ప్రభాకరరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఒడిశా నుంచి మద్యం అక్రమంగా తీసుకువస్తున్నట్లు సమాచారం అందడంతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. పండగలు, వివాహాలు జోరుగా జరుగుతున్నందున కాపలా కాస్తున్నామని అన్నారు. మద్యంతో దొరికిన వ్యక్తులపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాలు సీజ్ చేస్తామన్నారు. రాత్రి వేళల్లో కూడా నిఘా ఉంటుందని ఎస్‌ఐ చెప్పారు.

రైల్వే ట్రాక్‌పై ఒరిగిన లారీ



క్రేన్ సహాయంతో లారీని తీస్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: మండలంలోని సీతాపురం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రైల్వే ట్రాక్‌పై ఆదివారం మధ్యాహ్నం గ్రానైట్ లారీ అదుపు తప్పి ఒరిగిపోయింది. ఆ సమయానికి రాళ్ల లోడ్‌తో గుణుపూర్ వైపు గూడ్స్ రైలు రావడం గమనించిన గ్రామస్తులు ఆ బండికి సమాచారం అందించడంతో కాసేపు నిలిపివేశారు. టెక్కలి మండలం చల్లపేట గ్రామానికి చెందిన అప్పన్న తన లారీతో లింగాలవలస గ్రామం సమీపంలోని క్వారీకి వెళ్తుండగా.. సీతాపురం గ్రామ సమీపంలో స్పీడ్ బ్రేకర్స్ వద్ద లారీ అదుపు తప్పి సమీపంలోని రైల్వే బౌండరీని గుర్తించేందుకు పాతిపెట్టిన రైల్వే పట్టాను ఢీకొట్టి ట్రాక్‌పైకి ఒరిగిపోయింది. లారీ డ్రైవర్ కిందకు దూకేయడంతో ఆయనకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. అనంతరం స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని గూడ్స్ రైలును ఆపి క్రేన్ సాయంతో లారీని పక్కకు తీశారు. అనంతరం ట్రైన్ కూడా వెళ్లిపోయింది. అయితే లారీని పక్కకు తీసేందుకు సమయం పట్టడంతో గుణుపూర్ నుంచి విశాఖ వెళ్లే పాసింజర్‌ను రైల్వే అధికారులు కాసేపు ఆపారు.

రెండు వాహనాలు ఢీ: ముగ్గురికి గాయాలు

హిరమండలం: గొట్టా గ్రామం సమీపంలోని నవతల శ్రీముఖలింగం రోడ్‌లో బైక్, వ్యాన్ ఢీకొని ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాలకొండకు చెందిన బి.రాజ్‌కుమార్, జె.మణికంఠ, అదిపి కుమార్‌లు ఆదివారం పల్సర్ బైక్‌పై పాతపట్నంలో జరుగుతున్న నీలమణి దుర్గ గ్రామదేవత ఉత్సవాలకు బయల్దేరారు. వీరు గొట్టా గ్రామం మీదుగా వెళ్తుండగా పాతపట్నం వైపు నుంచి వస్తున్న వ్యాన్ వీరి బండిని ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వీరిని హిరమండలం పీహెచ్‌సీకి తరలించారు. రాజ్‌కుమార్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108 సాయంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లారు.

గోకర్ణపల్లిలో ఇరువర్గాల మధ్య కొట్లాట

పొందూరు: మండలంలోని అత్యంత సమస్యాత్మక గ్రామమైన గోకర్ణపల్లిలో ఆదివారం ఇరువర్గాల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. పోలీసులు పికెటింగ్ విధుల్లో ఉండగానే కొట్లాట జరగడం గమనార్హం. ఈ కొట్లాటలో చౌదరి వెంకటప్పారావు, దుప్పల అప్పలసూరిలకు గాయాలయ్యాయి. వీరిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. దుప్పల అప్పలసూరి పని ముగించుకుని నారాయణపురం కాలువ పక్కన ఇసుక బండి పెట్టడానికి వెళ్లాడు. అయితే అప్పటికే అక్కడ ఓ బైక్ పార్క్ చేసింది. ఆ బండి తీయాలని అప్పలసూరి చెప్పాడు. ఈ మాటలు ముదిరి రెండు వర్గాల మధ్య గొడవకు దారితీసింది. గ్రామంలో కొద్ది రోజుల కిందట చేపల చెరువు విషయంలో వివాదం మూలంగా ఇరువర్గాలపై కేసులు నమోదయ్యాయి. దీంతో పికెటింగ్ ఏర్పాటు చేశారు.

నారాయణపురం కాలువ దగ్గర జరుగుతున్న గొడవను తెలుసుకున్న పోలీసులు అక్కడకు వెళ్లి వారించారు. అయినా ఇరువర్గాల వారు కర్రలతో కొట్లాటకు దిగారు. దీంతో అప్పలసూరి, వెంకటప్పారావులు గాయపడ్డారు. ఆయా కుటుంబ సభ్యులు 108లో రిమ్స్‌కు తరలించారు. స్థానిక ఎస్‌ఐ లక్ష్మణరావు సిబ్బందితో గ్రామానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

'మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మాన్యువల్‌గా నిర్వహించి న్యాయం చేయాలని ఫ్యాప్టో ఐక్య ఉపాధ్యాయ సంఘాల వేదిక ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా ఫ్యాప్టో ఐక్య ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్వీస్ నిబంధనలను కాదని గత విద్యా సంవత్సరమంతా బదిలీల పేరుతో కాలయాపన చేయడం గందరగోళానికి గురి చేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో ప్రధాన కార్యదర్శి కొమ్ము అప్పలరాజు మాట్లాడుతూ తాత్కాలిక సర్దుబాట్ల ద్వారా రూ.2500 అదనంగా చెల్లిస్తూ ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ ఇవ్వకుండా పనిచేయించుకోవడం వెట్టి చాకిరీ కిందకే వస్తుందన్నారు. బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షులు పేకేటి రామారావు మాట్లాడుతూ నిబంధనలు లేని వెట్టి చాకిరీతో ప్రమోషన్ పోస్టుల్లో పని చేయించే విధానానికి స్వస్తి పలకాలని పేర్కొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ పాలిసెట్–2023 ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా సోమవారం నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రారంభం కానుంది. ఈ మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన విద్యార్థులు ర్యాంకు బట్టి షెడ్యూల్ మేరకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. జిల్లాలో ఏపీ పాలిసెట్ 11,189 మంది రాయగా, 9,705 మంది అర్హత సాధించారు. సహాయ కేంద్రంలో సోమవారం నుంచి జూన్ 5 వరకు ధ్రువీకరణ పత్రాలు పరిశీలించనున్నారు. ఈ నెల 25 నుంచి ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు ప్రక్రియ ప్రారంభమైంది. జూన్ ఒకటి లోపు ఫీజు చెల్లింపు పూర్తి చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు ప్రాసెసింగ్ ఫీజుచెల్లించిన రశీదు, పాలిసెట్‌ర్యాంకు కార్డు, హాల్ టిక్కెట్, 10వ తరగతి మార్కుల మెమో, నాలుగు నుంచి 10వ తరగతి వరకు స్టడీ ధ్రువీకరణ పత్రాలు (లేనివారు నివాస ధ్రువీకరణ పత్రం), ఈడబ్ల్యూఎస్ వర్తించేవారు అర్హత ధ్రువీకరణ పత్రం, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, టీసీలు తీసుకు రావాల్సి ఉంటుంది.

ప్రత్యేక రిజర్వేషన్లు వర్తించే విద్యార్థులు విజయవాడలో నిర్వహించే పాలిటెక్నిక్ కళాశాల సహాయ కేంద్రానికి వెళ్లాలి. మొదటి రోజు సోమవారం 1 నుంచి 12000 మధ్య ర్యాంకులు వచ్చిన వారి సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు.

జానకమ్మా.. నీ స్ఫూర్తి అమరం

- జెమ్స్ వైద్యకళాశాలకు జానకమ్మ మృతదేహం అప్పగింత
- పదేళ్ల కిందటే శరీర దానానికి అంగీకార పత్రం ఇచ్చిన జానకమ్మ



తల్లి జానకమ్మ ఫొటో చూపుతున్న కుమార్తెలు



మృతదేహాన్ని జెమ్స్‌కు తరలించే ముందు నివాళులు అర్పిస్తున్న డీఈఓ తిరుమల చైతన్య

శ్రీకాకుళం, శ్రీకాకుళం పీఎన్ కాలనీ : శ్రీకాకుళం పట్టణంలోని వైఎస్సార్ కూడలి సమీపంలో నివాసం ఉంటున్న అల్లూరి జానకమ్మ (86) మృతదేహాన్ని కుటుంబ సభ్యులు జెమ్స్ వైద్య కళాశాలకు అందజేశారు. పూర్తి ఆరోగ్యంగానే ఉన్న జానకమ్మ ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతిచెందారు. ఈమె పదేళ్ల కిందటే తన శరీరాన్ని మరణానంతరం వైద్యశాలకు దానం చేసేందుకు అంగీకారం తెలిపారు. దీంతో ఆమె ఆమె కుమారుడు, కుమార్తెలు తల్లి మృతదేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడేందుకు వీలుగా జెమ్స్ వైద్య కళాశాలకు అప్పగించారు. డైట్ ప్రిన్సిపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి తిరుమల చైతన్య పదేళ్ల కిందట పుష్పాంజలి అవేకింగ్ అండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను నెలకొల్పి తన కుటుంబ సభ్యుల దేహాలను మరణానంతరం వైద్య కళాశాలలకు అందజేయనున్నట్లు ప్రకటించారు. ఈ విషయాన్ని అప్పట్లో వార్తా కథనాలు ద్వారా తెలుసుకున్న జానకమ్మ తాను కూడా తన దేహాన్ని మరణానంతరం వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా ఇవ్వనున్నట్లు తిరుమల చైతన్యకు తెలియజేస్తూ అంగీకార పత్రాన్ని ఇచ్చారు. దీంతో ఆదివారం జానకమ్మ మృతదేహాన్ని జెమ్స్‌కు అందజేశారు. ఈమె భర్త అల్లూరి కృష్ణమూర్తి పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ఆయన కొన్నేళ్ల కిందట మృతి చెందారు. జానకమ్మ కుమారుడు విశాఖపట్నంలో ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండగా ముగ్గురు కుమార్తెలు పద్మజ, రాజ్యలక్ష్మి, భాగ్యలక్ష్మి జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. దేహదానం చర్యను పలువురు అభినందించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఉమా శంకర్, పీఏసీటీ సంస్థ ప్రతినిధులు డాక్టర్ తిరుమల చైతన్య, నాగేశ్వరమ్మ, ఉషారాణి, భారతమ్మ పాల్గొన్నారు.

మహిళ అనుమానాస్పద మృతి

- హత్య చేశారని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు





సంఘటనా స్థలంలో విచారణచేస్తున్న టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి (ఇన్‌సెట్లో) అనుమానాస్పదంగా మృతి చెందిన మట్ట తులసమ్మ

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి మండలం కురుడు పంచాయతీ ఎరకయ్యపేటలో మట్ట తులసమ్మ(46) అనే మహిళ అనుమానాస్పద రీతిలో మృతి చెందారు. ఆదివారం వేకువజామున వెలుగు చూసిన ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు..

ఎరకయ్యపేటకు చెందిన తులసమ్మ ఊరిలో ఒంటరిగా ఉంటున్నారు. ఆమె భర్త గంగులు కొన్నాళ్ల కిందట చనిపోయారు. వీరికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తెకు పోలాకి మండలం వనవిష్ణుపురం గ్రామానికి చెందిన బొల్ల శంకర్ అనే వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కుమారుడు నవీన్ కోడూరులో ఇంటర్ చదువుతున్నాడు. తులసమ్మ మాత్రమే ఎరకయ్యపేటలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం గ్రామం సమీపంలోని టేకు తోటలో ఆమె మృతదేహం ఒక టేకు చెట్టుకు ఉరికి వేలాడుతూ కనిపించింది. ఈ మృతదేహాన్ని ఓ పశువుల కాపరి చూసి ఊరివారికి సమాచారం అందించారు. అనంతరం కుమారుడు, కుమార్తె, అల్లుడు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

'ఆత్మహత్య కాదు..'

తులసమ్మ ఆత్మహత్య చేసుకోలేదని, ఆమె ఒంటిపై గాయాలు ఉన్నాయని ఎవరో హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆ మేరకు పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, నరసన్నపేట సీఐ డి.రాము, సంతబొమ్మాళి ఎస్‌ఐ కె.మధుసూదనరావు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పూర్తి వివరాలు సోమవారం వెల్లడిస్తామని తెలిపారు.

అతడిపైనే అనుమానం

తులసమ్మ మృతి విషయంలో కుటుంబ సభ్యులు ఓ వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేశారు. పోలాకి మండలం వన విష్ణుపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తరచూ ఎరకయ్యపేటకు వచ్చేవాడని, తులసమ్మతో చనువుగా ఉండేవాడని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తులసమ్మ మృతికి అతడే కారణమై ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

30న సేవా కార్యక్రమాలు



ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

నరసన్నపేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ పాలనకు ఈ నెల 30వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా మంగళవారం అన్ని నియోజకవర్గాల్లో సేవా కార్యక్రమాలు, కార్యకర్తల సమావేశాలు, కేక్ కటింగ్‌లు చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రిగా జగనన్న సంతకానికి 30వ తేదీ నాటికి నాలుగేళ్లు పూర్తవుతున్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు.

నేడు బైక్ ర్యాలీలు..

పేద ఇళ్లపై చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా సోమవారం అన్ని నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు చేపట్టాలని కృష్ణదాస్ సూచించారు. టీడీపీ దుర్మార్గపు వైఖరిని ఎండకట్టాలని కోరారు. పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు.

రాయితీపై పత్తి విత్తనాలు ఇవ్వాలి

కొత్తూరు: జిల్లాలో పత్తి సాగు చేస్తున్న రైతులకు రాయితీపై పత్తి విత్తనాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సిర్ల ప్రసాదరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో వాణిజ్య పంటల్లో ప్రధాన పంటగా పత్తి సాగు చేస్తున్నారని అన్నారు. జూన్ నెల మొదటి వారంలో పత్తి విత్తనాలు విత్తుతారని అన్నారు. పత్తి సాగు చేస్తున్న రైతులకు అవసరమైన పత్తి విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేయాలని కోరారు. జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారని, బయట మార్కెట్‌లో ధర ఎక్కువగా ఉందని, నకిలీలు కూడా ఉన్నాయని ఏపీ సీడ్స్ ద్వారా పంపిణీ చేయాలని ప్రసాదరావు కోరారు.

మందసలో ఉత్సవ ఉత్సాహం



మందస గ్రామదేవత అన్నపూర్ణమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



గ్రామదేవత ఊరేగింపునకు ప్రత్యేకంగా తయారు చేసిన రథం

మందస: మేజరు పంచాయతీ మందస పట్టణంలోని గ్రామదేవత అన్నపూర్ణమ్మతల్లి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాజుల కాలం నుంచి ఇక్కడ గ్రామదేవత ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు వేకువజాము నుంచే అన్నపూర్ణమ్మతల్లిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారిని దేవరవీధిలో గల ప్రత్యేక పూజారులు దాసరి గణేశ్వరరావు, కృష్ణమ్మ ఇంటి ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కుటీరంలో ఉంచి, పూజలు చేస్తారు. ముందుగా అమ్మవారికి ఆహ్వానం పలకడానికి మేళతాళాలు, పూర్ణకుంభాలు, గజముద్దలతో భారీగా భక్తులు అన్నపూర్ణమ్మ గుడికి చేరుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించి, చల్లదనం చేశారు. అమ్మవారిని ఊరేగించడానికి ప్రత్యేక రథం ఏర్పాటు చేసి, పీఠాన్ని తయారు చేశారు. వీటిని అమ్మవారి వద్దకు చేర్చారు. భక్తిశ్రద్ధలతో ఘనంగా అమ్మవారిని దేవరవీధిలో కుటీరానికి తీసుకువచ్చారు.